అందుబాటులో కార్పొరేట్ వైద్యం



భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆధునిక సదుపాయాలతో ప్రసూతి వార్డు

- రూ.3.28 కోట్లతో భీమిలి సీహెచ్‌సీలో పూర్తి వసతులు
- 9 మంది వైద్యుల నియామకంతో సంతృప్తికరంగా వైద్య సేవలు

భీమునిపట్నం: సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చింది... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్య మిస్తుండడంతో ఆస్పత్రుల రూపురేఖలే మారిపోతున్నాయి. మరోవైపు అవసరమైన వైద్య పరికరాలు, మందులు సమకూర్చి... వైద్య సిబ్బందిని నియమించడంతో పేద రోగులకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయి. ఇందుకు చక్కని ఉదాహరణే భీమిలిలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి. ఇక్కడి ఆవరణలో ప్రభుత్వం కొత్త భవనం నిర్మించి రోగులకు మంచి వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్ తరహాలో పలు సేవలకు వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఎన్నడూ లేని విధంగా చక్కని వైద్య సేవలు అందుతున్నాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు ఇదే 30 పడకల ప్రధాన ఆస్పత్రిగా ఉంది. అయినప్పటికీ గతంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా సరైన వసతులు, మందులు, వైద్యులు సరిగ్గా లేక రోగులు అవస్థలు పడేవారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ ఆస్పత్రి ముఖచిత్రమే పూర్తిగా మారిపోయింది. రూ.3.28 కోట్లతో అన్ని వసతులతో కొత్త భవనం అందుబాటులోకి తీసుకొచ్చి, పలు విభాగాలకు వైద్యులను నియమించడంతో సంతృప్తికరంగా సేవలు అందుతున్నాయి. గతంలో ఇద్దరే వైద్యులు ఉండే వారు. వాళ్లు కూడా సరిగ్గా విధులకు హాజరయ్యేవారు కాదు. దీంతో వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగా అందేవి. ప్రస్తుతం ఆస్పత్రిలో తొమ్మిది మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. అవసరమైన నర్సులు, ల్యాబ్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్, ముఖ్యమంత్రి ఈ – ఐ కేంద్రం సిబ్బంది, టీబీ యూనిట్, హెచ్‌ఐవీ కేంద్రంలో మెరుగైన సేవలు అందడంతో రోగులు కూడా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఈ సీహెచ్‌సీకే వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

పలు సమస్యలకు సర్జరీలు

స్థానిక సీహెచ్‌సీలో పలు సర్జరీలు నిర్వహించే సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రమాదాల్లో గాయపడిన వారికి, అగ్నిప్రమాదాల్లో గాయపడిన వారికి జనరల్ సర్జన్ డాక్టర్ జి.గోవింద్ ఆధ్వర్యంలో అవసరమైన ఆపరేషన్లు చేస్తున్నారు. ఇంకా ఎపండిసైటిస్, హెర్నియా, పైల్స్ మొదలైన వాటికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వీటిని ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకుంటే సుమారు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు అవుతుంది. అదే ఇక్కడి సీహెచ్‌సీలో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా వైద్య సదుపాయాలు అందుతుండడంతో స్థానికులంతా ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

వైద్యుని పేరు	వైద్య విభాగం
డాక్టర్ ఫణికుమార్	జనరల్ ఫిజీషియన్
డాక్టర్ హరిణి	జనరల్ మెడిసన్
డాక్టర్ గోవింద్	జనరల్ సర్జన్
డాక్టర్ పూర్ణిమ	చిన్నపిల్లల వైద్య నిపుణురాలు
డాక్టర్ విజయశ్రీ	స్త్రీ వైద్య నిపుణురాలు (గైనికాలజిస్ట్)
డాక్టర్ ప్రదీప్	ఎనస్తీషియన్
డాక్టర్ సురేఖ	దంతవైద్యం (డెంటిస్ట్)
డాక్టర్ రేఖ	బీపీ, షుగర్
డాక్టర్ కళ్యాణ్	నవజాతి శిశువుల పర్యవేక్షణ



ప్రత్యేక సదుపాయాలతో పిల్లల వార్డు

క్లుప్తంగా

అష్టలక్ష్మి సన్నిధిలో హోమం



హోమంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తదితరులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు అన్నంరాజునగర్‌లో గల శ్రీఅష్టలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మంగళవారం నిర్వహించిన హోమంలో అనకాపల్లి పట్టణ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బెందాళం లక్ష్మీపతి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. హోమం అనంతరం సన్నిధిలో గల అష్టలక్ష్ములను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఆశీర్వచనం అందజేశారు.

కుంతీ మాధవ స్వామికి నేడే లక్ష తులసి పూజ



కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామికి బుధవారం లక్ష తులసి పూజ నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఉదయం 5.30 గంటలకు కుంతీ మాధవ స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. ఏడు గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. 9.30కి లక్ష తులసి పూజ ప్రారంభమవుతుంది. పూజకు అవసరమయ్యే తులసి దళాలను సమకూర్చారు. ఆలయం లోపలి భాగాన్ని పూలమాలలు, అరటి మొక్కలతో సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు భాగాన కొబ్బరి కమ్మలతో పందిరి వేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మణిపూర్ బాధితులకు సాయం



ఆలీవర్ రాయికి నగదు అందిస్తున్న కేథరిన్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు

తగరపువలస: మణిపూర్ బాధితులకు భీమిలి కేథరిన్ విద్యాసంస్థల నుంచి సాయం అందించడానికి చైర్మన్ ఆలీవర్ రాయి, మరికొందరు సభ్యులు అక్కడకు వెళ్లారు. ఇందుకు తమ వంతు సాయంగా కేథరిన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కొంత నగదు సేకరించి అందించారు. మణిపూర్‌లో బాధితులకు వస్త్రాలు, స్టేషనరీ, మందులు, నిత్యావసర సరకులు, వంటపాత్రలు అందించడానికి అక్కడకు చేరుకున్నారు. వారం రోజులపాటు వీరు అక్కడ ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

తీరంలో నటి నివిష్క సందడి



తీరంలో కన్నడ నటి నివిష్క

కొమ్మాది: వైజాగ్ బీచ్ అద్భుతంగా ఉందని కన్నడ నటి నివిష్క అన్నారు. ఆమె నగరంలో జరుగుతున్న ఓ షూటింగ్ కోసం మంగళవారం వచ్చారు. షూటింగ్ విరామ సమయంలో వైజాగ్ నుంచి భీమిలి వరకు ఉన్న పలు పర్యాటక ప్రాంతాలు సందర్శించారు. ఈ సందర్భంగా భీమిలి బీచ్ వద్ద ఫొటోలు తీసుకుని సందడి చేశారు. ఇక్కడి పచ్చదనం, ప్రకృతి అందాలు వావ్ అనిపించే విధంగా ఉన్నాయని ఆమె కితాబిచ్చారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఈవోఆర్డీగా పదోన్నతి



తోటారావు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న టి.వి.తోటారావుకు ఈవోఆర్డీగా పదోన్నతి లభించింది. దుంబ్రిగుడ ఈవోఆర్డీగా ఉన్నతాధికారులు నియమించారు. ఇతను 2022 ఆగస్టు నుంచి పద్మనాభంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు



మెయిన్ రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించి చదును చేస్తున్న దృశ్యం

భీమునిపట్నం: స్థానిక మెయిన్ రోడ్డులో ఇరుకుగా ఉన్న మలుపు ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశాల మేరకు సిబ్బంది బాబ్‌కార్టు సాయంతో మంగళవారం తొలగించి ఆ ప్రాంతాన్ని చదును చేశారు. ఇక్కడ ఇరువైపులా టిఫిన్ విక్రయదారులు రోడ్డును ఆక్రమించడం వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై జెడ్సీ రాము సోమవారం పరిశీలించి విక్రయదారులను హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించి మళ్లీ ఎవరూ ముందుకు రాకుండా ఆ ప్రాంతమంతా చదును చేయించారు. దీంతో ఇప్పటి వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండగా ఇప్పుడు సమస్య పరిష్కారమైంది.

గీతారెడ్డికి ప్రతిభా పురస్కారం



సజ్జల రామకృష్ణా రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గీతారెడ్డి

మధురవాడ: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాల్లో మధురవాడ పరదేశిపాలెంకి చెందిన మహిళా అడ్వకేట్, మోటివేషనల్ స్పీకర్, విద్యావేత్త బోర గీతారెడ్డిని మహిళా సాధికారిత పురస్కారం వరించింది. సోమవారం యూనివర్శిటీలో నిర్వహించిన వేడుకల్లో ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కలెక్టర్ ఎమ్.వేణుగోపాలరెడ్డి, వీసీ రాజశేఖర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆమె ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో కొనసాగే 'ఏపీసీఐఎమ్ ఎస్ఎమ్ఈ' చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమెకి పురస్కారం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీధిదీపాల నిరంతర వెలుగులకు ప్రణాళికలు



ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావుతో ఇంజినీరింగ్ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ 1, 2, 8 జోన్ల పరిధిలో వీధిదీపాల నిరంతర వెలుగులకు లోటుపాట్లు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం బ్రిడ్జ్ అండ్ రూఫ్, విద్యుత్ ఇంజినీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ విభాగం సమన్వయంతో ఎప్పటికప్పుడు వీధిదీపాలు వెలిగేలా బ్రిడ్జ్ అండ్ రూఫ్ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. లోపాలను సరిచేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రిడ్జ్ అండ్ రూఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, వి.పృథ్వీ, జోన్ – 2 ఇంజినీర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది తీరుపై అసహనం



తాటితూరు ఎస్సీ కాలనీలో ఇంటి మీద వాలిపోయిన విద్యుత్ స్తంభం



జెడ్పీ హైస్కూల్ రోడ్డులో అడుగుభాగం తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం

తగరపువలస: చిట్టివలస రూరల్ విద్యుత్ శాఖ సిబ్బంది తీరుపై భీమిలి మండలం తాటితూరు సర్పంచ్ శిరిగుడి సంతోషి అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ... పంచాయతీలోని అన్ని వార్డుల్లో అదనపు స్తంభాలు, వీధి దీపాలు, ఇతర ఉపకరణాలు కల్పించాలని ఏడాది క్రితం విద్యుత్‌శాఖకు రూ.13 లక్షలు చెల్లించామన్నారు. ఇందులో భాగంగా స్తంభాలు మార్చడం, తుప్పు పట్టిన వాటి స్థానంలో కొత్తవి మార్చాల్సి ఉందన్నారు. దీనిపై పలుమార్లు వినతిపత్రాలు కూడా ఇచ్చామన్నారు. ఇటీవల విద్యుత్ సిబ్బంది మళ్లీ వేసిన అంచనాల ప్రకారం రూ.15 లక్షల అభివృద్ధి పనులకు రూ.5 లక్షలతో పనులు చేయిస్తున్నామన్నారు. అయినప్పటికీ తాము ఫిర్యాదు చేసిన విద్యుత్ స్తంభాలు మార్చకపోవడం, తుప్పుపట్టిన 10 స్తంభాల స్థానంలో కొత్తవి వేయడం లేదన్నారు. గతంలో ఎస్సీ కాలనీలో కాకర అప్పన్న ఇంటిపై వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని మార్చమంటే అధికారులు డబ్బులు చెల్లించాలన్నారని... మంగళవారం తమకు సమాచారం లేకుండా స్తంభాన్ని మార్చారని ఆరోపించారు. దీనిపై చిట్టివలస రూరల్ ఏఈఈ జాగరావు రామును వివరణ కోరగా ఎస్సీ కాలనీలో స్తంభం మార్చాలంటే డబ్బులు కట్టాలన్నది నిజమేనన్నారు. కానీ తమ సిబ్బంది స్తంభం మార్చకుండా కేవలం ఇంటిపై వాలిన దానిని బయటకు లాగారని తెలిపారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

తగరపువలస: భీమిలి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు బుధవారం నుంచి మూడు రోజులపాటు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరగనున్నాయి. అండర్ – 14, 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నారు. బుధవారం బాలికలకు, గురువారం బాలురకు, చివరి రోజైన శుక్రవారం బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నుంచి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నామని హెచ్‌ఎం శ్రీనివాసరావు, మండల కో – ఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు. 13న బాలురకు, 14న బాలికలకు, 15న బాలురు, బాలికలకు అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మండల జట్టుకు ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

గిరిజన భవన్‌ను సందర్శించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



మ్యూజియంలో పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్‌ను మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్రావు సందర్శించారు. భవన్ కార్యక్రమ తీరును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవన్‌లో గల మ్యూజియం, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఇక్కడ కార్యాలయ సిబ్బందిని చిన్నబాబు పరిచయం చేశారు.

14 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రామ సత్యం

పద్మనాభం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతమయ్యేందుకు పీడీలు అందరూ సహకరించాలని పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రామ సత్యం కోరారు. పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న క్రీడా పోటీలపై పీడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, కోకో, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లటిక్స్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. బాలికలకు పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో, బాలురకు గోస్తనీ విద్యాపీఠ్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

విద్యార్థినులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థినులకు క్రీడా పరికరాలు అందిస్తున్న భరత్

భీమునిపట్నం: విద్యార్థినులంతా క్రీడలు, ఆటల్లో శిక్షణ పొంది వాటిల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త భరత్ మంగళవారం సాయంత్రం క్రీడా పరికరాలు అందించారు. క్యారమ్ బోర్డులు, టెన్నికాయిట్, చెస్‌బోర్డు, వాలీబాల్‌తోపాటు మరికొన్ని క్రీడలకు సంబంధించిన సామగ్రి అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థినుల కోసం మంచి ఉద్దేశంతో పరికరాలు అందించిన భరత్ అభినందనీయులన్నారు. అందరూ ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేయాలని కోరారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, జీసీడీవో కలీషాబేగం, ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

మానసిక సమస్యల వల్లే ఆత్మహత్యలు



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న మానసిక వైద్య నిపుణురాలు తేజస్విని

ఆనందపురం : మానసిక సమస్యలే ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.తేజస్విని చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆనందపురం హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అది మంచిది కాదన్నారు. అలాంటి సమయంలో అఘాయిత్యాలకు పాల్పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితుల సలహాలు తీసుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల మానసిక సమస్యలు తలెత్తి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. యువత సమాజానికి మంచిపేరు తీసుకొచ్చే విధంగా మానసిక స్థితిని మెరుగు పరచుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు రోగులను పరిశీలించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాస్, వైద్యాధికారి ఎం.గంగునాయుడు, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, సామాజిక కార్యకర్త సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రణాళికలు రూపొందించి, పనులు ప్రారంభమయ్యేలా చూస్తున్నామన్నారు. జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం యల్లపువానిపాలెంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి, సంక్షేమ పథకాల వివరాలు ఉన్న పత్రాలను అందించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని స్థానికులు కోరగా, దీనిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, ఆళ్ల పైడిరాజు, అయితశెట్టి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అధికారులను చూసి కబ్జాదారుల పరార్



భీమిలి క్రాస్ రోడ్డు వద్ద ప్రభుత్వ భూమి

ఆనందపురం : మండలంలోని వేములవలస పంచాయతీ భీమిలి క్రాస్ రోడ్డు వద్ద కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి మంగళవారం కొంతమంది యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకోవడంతో కబ్జాదారులు పరారయ్యారు. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని వేములవలస సర్వే నంబరు 130లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కలిసి ఉన్నాయి. ఇదే సర్వే నంబరులో గల భూములలో కొంత రోడ్డు నిర్మాణం నిమిత్తం జాతీయ రహదారుల సంస్థ సేకరించి సంబంధిత వ్యక్తులకు నష్టపరిహారం కూడా అందజేసింది. మిగతా స్థలం ఖాళీగా ఉంది. దీంతో దీనిపై కొంతమంది అక్రమార్కుల కన్నుపడడంతో కబ్జా చేయడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం జేసీబీ, ట్రాక్టర్ తీసుకొచ్చి తుప్పలు, డొంకలు తొలగించారు. ఈ క్రమంలో స్థానికులు రెవెన్యూ అధికారుకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్కడకు చేరుకునే సరికి కబ్జాదారులు పరారయ్యారు. ఆక్రమణకు యత్నించిన స్థలం గతంలో రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూమిగా అధికారులు భావిస్తున్నారు. గతంలో ఇదే భూమి ఆక్రమణకు గురి కాగా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ లోకవరపు రామారావు మాట్లాడుతూ యంత్రాలు, కబ్జాదారుల వివరాలు కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్య పాలెం పంచాయతీలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొంటారు.

పబ్లిక్ డిమాండ్

చెత్త తీసి.. రోడ్డు మీదే వదిలేశారు



చంద్రంపాలెం సర్వీసు రోడ్డులో వదిలేసిన చెత్త

మధురవాడ: చంద్రంపాలెం హైవే సర్వీసు రోడ్డులో దుర్గా థియేటర్ సమీపంలో కొద్ది రోజుల క్రితం కాల్వలోని చెత్త తీసి రోడ్డు మీదనే వదిలేశారు. అసలే ఉదయం, సాయంత్రం ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. ఈ చిన్న రోడ్డులో చెత్త వదిలి పెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. వర్షాకాలం కావడంతో తీసిన చెత్త మళ్లీ కాల్వలోకి నీటితో వెళ్లి పోయే అవకాశం ఉంది. సచివాలయం సిబ్బంది ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్త తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– గేదెల మోహన్‌కృష్ణ, వాహనదారుడు.

ద్విచక్ర వాహనం రికవరీ

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో మెకానిక్ షాపు నుంచి అపహరించిన బైక్‌ను రికవరీ చేసినట్టు క్రైమ్ ఎస్ఐ ఆర్.మల్లేశ్వరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పద్మనాభం జంక్షన్‌లోని భవిష్య మెకానిక్ షాపునకు అనంతవరానికి చెందిన కశిరెడ్డి వెంకటరమణ తన బైక్‌ను ఈ ఏడాది జూన్ 30న మరమ్మతులకు ఇచ్చాడు. షాపు వద్ద ఉన్న బైక్‌ను శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలోని గొరికిపేటకు చెందిన కెల్లి మణికంఠ (19) అపహరించుకుపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మణికంఠ నుంచి బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.